క్లుప్తంగా

మొక్కల పెంపకం అందరి బాధ్యత



బంటుమిల్లి: రాబోవు తరాలకు కాలుష్య రహిత పర్యావరణం ఉండాలంటే మొక్కల పెంపకం బాధ్యత అందరిదీ అని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.జగన్‌మోహన్‌రావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అధ్యాపకులు, విద్యార్థులు కలిసి శనివారం మొక్కలు నాటారు. పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగంగా కాలేజీ ఆవరణలో పలు రకాల మొక్కలు నాటి ర్యాలీ నిర్వహించారు.

నివాస ధ్రువీకరణ పత్రాలు



గణపేశ్వరం(నాగాయలంక):మండలంలోని గణపేశ్వరం సచివాలయం పరిధిలోని దిండి గ్రామానికి చెందిన 17 మంది గిరిజనులకు ఆధార్ కార్డులు పొందే నిమిత్తం తహసీల్దార్ సీహెచ్‌వీ ఆంజనేయప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం నివాస ధ్రువీకరణ పత్రాలు అందించారు. వీరు చాలా కాలంగా ఆధార్ కార్డులు పొందే అవకాశం లేక ఇబ్బందులు పడుతున్న తీరును తహసీల్దార్ గర్తించి ఈ పత్రాలు ఇవ్వడానికి ముందుకొచ్చారు. పత్రాలు అందించిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెల్లంకొండ శ్రీనివాసరావు, వీఆర్వో జయరామ్, గ్రామ పెద్దలు లోయ నాంచారయ్య, కట్టా వెంకటేశ్వరరావు(వార్డు మెంబర్) పాల్గొన్నారు.

పెడనలో జాబ్‌మేళా

పెడన:జాబ్ మేళాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి (డీఎస్‌డీవో)డాక్టర్ పి.నరేష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని శ్రీబొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన నిరుద్యోగులను ఉద్దేశించి నరేష్‌కుమార్ మాట్లాడారు. ప్రిన్సిపల్ బి.రామారావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు. 75 మంది నిరుద్యోగులు రాగా 49 మందిని ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు.

సేవా కార్యక్రమాలు

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు సేవా కార్యక్రమాలను గ్రామాల్లో ప్రారంభించారు. ఉపకులపతి ఆచార్య కె.రాంజీ ఆదేశాల మేరకు స్వర్ణాంధ్రా-స్వచ్ఛాంధ్రా కార్యక్రమం నిర్వహించారు. మచిలీపట్నం మండలంలోని కోన, పల్లె తుమ్మలపాలెం, పాతేరు, పోలాటితిప్ప, రుద్రవరం, గుండుపాలెం, సీతారామపురం గ్రామాలతో పాటు శారదానగర్ ప్రాంతంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సమన్వయకర్త డాక్టర్ ఎం.శ్రావణి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు రవి, కవిత, శాంతికృపా, శేషరెడ్డి, దుర్గాప్రసాద్, సల్మా, పీడీ గోపి పాల్గొన్నారు.

ఉచితంగా వైద్య పరీక్షలు

గూడూరు:స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని రామానుజవత్తర్లపల్లిలో వైద్య శిబిరం నిర్వహించారు. మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 70 మంది రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి తరుణ్‌శంకర్, ఎంపిహెచ్ఈఓ ఎం.వీరయ్య, రాజులపాటి జమదగ్ని, హెచ్‌వి సరళ, సీహెచ్‌వో మట్టా పావని తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి(ఘంటసాల):తాడేపల్లి గ్రామంలోని మలయాళ స్వామి పెద్దాశ్రమంలో కృష్ణాజిల్లా బ్లైండ్‌నెస్ కంట్రోల్ సొసైటీ, చెన్నై శంకర నేత్రాలయ కంటి వైద్యశాల, దివంగత సూరపనేని రామలింగయ్య, వెంకటరావమ్మ కుటుంబం ఆధ్వర్యంలో మూడవ రోజు శనివారం నిర్వహించిన ఉచిత కంటి పొర చికిత్స శిబిరంలో 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎన్నారై సూరపనేని శ్రీనివాస్, నాగ ప్రియ దంపతులు ఆర్థిక సహకారంతో శిబిరం నిర్వహించారు.

రామలింగేశ్వరునికి అభిషేకాలు



చల్లపల్లి:మండల పరిధిలోని నడకుదురులో వేంచేసియున్న శ్రీపృథ్వీశ్వరస్వామి ఆలయం మాసశివరాత్రి సందర్భంగా శనివారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ అర్చకులు కంతంరాజు పృథ్వీశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు.

నాగాయలంక:శ్రీరామ పాదక్షేత్రం వద్ద కృష్ణానది మండపంలో గంగ పార్వతీ సమేత రామలింగేశ్వర శివలింగానికి బ్రహ్మశ్రీ అంబా సాయికిరణ్ శర్మ నేతృత్వంలో పండితుల బృందం ప్రత్యేక పూజలు చేశారు.

అపూర్వమైన వక్కలగడ్డకు శ్రీకారం



గ్రామంలో పరిసరాలను శుభ్రపరుస్తున్న గ్రామస్తులు



మొదటి రోజు కార్యక్రమంలో శ్రమదానం చేసిన వక్కలగడ్డ ప్రజలు

చల్లపల్లి: తాము పుట్టిపెరిగిన గ్రామాన్ని సుందరంగా, ఆహ్లాదకరంగా, ఆకట్టుకునేలా అన్ని రంగాల్లో తీర్చిదిద్దుకునేందుకు వక్కలగడ్డ గ్రామస్తులు 'అపూర్వమైన వక్కలగడ్డ' అనే పేరుతో శనివారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సుమారు 25 మందికి పైగా తెల్లవారుజామునే వచ్చి చీపుర్లు, కత్తులు, కట్టర్లు చేతపట్టుకుని గ్రామాన్ని పరిశుభ్రపరచుకోవటంలో నిమగ్నమయ్యారు. ప్రవాస భారతీయులు మండవ శేషగిరిరావు ఆలోచనలో నుంచి పుట్టిన ఈ అపూర్వమైన వక్కలగడ్డ కార్యక్రమానికి గ్రామస్తుల నుంచి అపూర్వమైన స్పందన లభించింది. పిలుపు ఇచ్చిందే తడవుగా ముందుగా నిర్ణయించుకున్న ప్రదేశానికి చేరుకుని శ్రమదానం చేశారు. మేము సైతం అంటూ మహిళలు కూడా పొలుగు, చీపుర్లు చేతపట్టి పరిసరాలను శుభ్రపరిచారు. శేషగిరిరావు బ్రష్ కట్టర్ సమకూర్చగా గామానికి చెందిన పాలడుగు వెంకట శ్రీనివాసరావు, చల్లపల్లికి చెందిన తాతినేని రమణలు ఇతర పనిముట్లు సిద్ధం చేశారు. కొందరు ఇళ్లదగ్గర ఉన్న సొంత పనిముట్లు తెచుకుని కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి 'అపూర్వమైన వక్కలగడ్డ'కు ఇచ్చిన ఒక్కపిలుపుతో అందరూ కలిసికట్టుకగా పాల్గొనటంపై ఎన్ఆర్ఐ శేషగిరిరావు అనందం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు.

కేవీకే సేవలు రైతులకు చేరువ చేయాలి

విశ్వ విద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ



మొక్కలు నాటుతున్న విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ, డాక్టర్ దుర్గా ప్రసాద్

ఘంటసాల:కృషి విజ్ఞాన కేంద్రం సేవలను రైతులకు చేరువ చేయాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ, సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ దుర్గా ప్రసాద్ అన్నారు. ఘంటసాల గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని వారు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఘంటసాలలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినీలకు గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమం యొక్క ప్రణాళిక విధానాలను, అచరించాల్సిన మెలకువలను తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో ఒక ఎకరం పొలంలో సేంద్రీయ వ్యవసాయ విధానంలో వరి సాగు చేస్తున్న పొలాన్ని పరిశీలించారు. ఈ పొలం జాతీయ సేంద్రీయ ఉత్పత్తి కార్యక్రమంలో భాగంగా నమోదు చేయబడిందని అధికారులకు కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి తెలిపారు.

సామూహిక నివారణతో సత్ఫలితాలు



పోస్టర్ విడుదల చేసిన జెడ్పీటీసీ సభ్యురాలు కల్యాణి, ఏవో మురళీకృష్ణ, రైతులు

చల్లపల్లి: రైతులు సామూహికంగా ఎలుకల నివారణ చర్యలు చేపట్టినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని వ్యవసాయాధికారి కె.మురళీకృష్ణ తెలిపారు. సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని వక్కలగడ్డ పంచాయతీ కార్యాలయం వద్ద అవగాహన సదస్సు నిర్వహిచారు. అనంతరం ఎలుకల నివారణకు బ్రోమోడయోలోన్ మందును పంపిణీ చేశారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ మందును పూర్తిగా ఉచితంగా అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వక్కలగడ్డ సర్పంచ్ వల్లూరు ఉమ, జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కళ్యాణి, వైయస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఏఎంసి ఛైర్మన్ తోట కనకదుర్గ రైతులు తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడ్డ విద్యార్థులను తీర్చిదిద్దండి



క్లస్టర్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో-1 సలోమి

పెడన: ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల నిర్వహించిన ఎఫ్ఏ పరీక్షల్లో మార్కులను బట్టి గ్రేడ్‌లు కేటాయించామని, బాగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని మరింత మెరుగుపరిచేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈవో-1 సలోమి అన్నారు. మండలంలోని ఉపాధ్యాయుల క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలను ఆమె ఎంఈవో-2 హరినాథ్‌తో కలిసి శనివారం పరిశీలించారు. తోటమూల జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ గత నెలలో జరిగిన ఎఫ్ఏ-1 పరీక్షల్లో విద్యార్థుల ప్రగతి నివేదిక ఆధారం చేసుకుని వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలన్నారు. అర్బన్, రూరల్ పరిధిలోని 64 పాఠశాలల నుంచి చెన్నూరు ఉన్నత పాఠశాలలో 42, పెనుమల్లి ఉన్నత పాఠశాలలో 39, నందమూరు ఉన్నత పాఠశాలలో 58, బిజికె జడ్పీహెచ్ఎస్‌లో 59, తోటముల ఉన్నత పాఠశాలలో 50 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్‌బీఐ ఆన్‌లైన్ పరీక్ష



పరీక్ష రాసి వస్తున్నర అభ్యర్థులు

పెడన:స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వివిధ ఉద్యోగాల భర్తీ కోసం శనివారం మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల సెంటరులో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. నాలుగు షిఫ్టులకు 720 మంది అభ్యర్థులకు గాను 509 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి, సెంటర్ అడ్మిన్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. మొదటి షిఫ్టులో 180 మందికి గాను 126 మంది హాజరవ్వగా 54 మంది అబ్సెంట్ అయ్యారన్నారు. రెండో షిఫ్టులో 180 మందికి గాను 133 మంది హాజరయ్యారని, 47 మంది అబ్సెంట్ అయ్యారన్నారు. మూడో షిఫ్టులో 180 మందికి గాను 125 మంది హాజరవ్వగా 55 మంది గైర్హాజరయ్యారన్నారు. నాలుగో షిఫ్టులో 180 మందికి గాను 125 మంది హాజరయ్యారని, 55 మంది రాలేదన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా నాలుగు షిఫ్టుల్లో కూడా పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు.

కఠిన చర్యలు తీసుకోవాలి



విద్యాశాఖ సహాయ సంచాలకులు విద్యాలతకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

మచిలీపట్నంఅర్బన్: దసరా శెలవుల్లో నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ కృష్ణా జిల్లా కార్యదర్శి ఎస్. సమరం కోరారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం విద్యాశాఖ సహాయ సంచాలకులు ఎం. విద్యాలతకు వినతి పత్రం అందించారు. ప్రభుత్వం సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు సెలవులు ప్రకటించిందన్నారు. అయితే కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా అక్రమంగా తరగతులు నిర్వహించే ప్రయత్నం చేస్తున్నాయని తెలిపారు. అలాంటి విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు కీర్తి, మచిలీపట్నం మండల కార్యదర్శి ప్రదీప్, జిల్లా కమిటీ సభ్యులు బి. పూజిత, బషీమ్, మండల కమిటీ సభ్యుడు జైకర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఉద్యోగుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు

మచిలీపట్నంటౌన్:సుదీర్ఘకాలంగా తామెదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. మచిలీపట్నం, పామర్రు డివిజన్ల నుంచి కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వైద్య సౌకర్యాలు, జీపీఎఫ్ పెన్షన్ విధానం అమలు చేయాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఒకే సబ్ స్టేషన్‌లో పని చేస్తున్న వారికి వ్యత్యాస జీతాల విధానం రద్దు చేయాలని, షిఫ్ట్ ఆపరేషన్ థియేటర్లకు సర్వీస్, ఇన్సెంటివ్‌లు ఇవ్వాలని, కారుణ్య నియామకంలో పాత విధానాన్ని అవలంబించాలని డిమాండ్ చేశారు. జేఏసీ ఛైర్మన్ బి.శ్రీనివాసరావు, జేఏసీ కన్వీనర్ వి.అంకబాబు, జేఏసీ నాయకులు ఎల్.రామ్మోహన్‌రావు, పి.డేవిడ్ రాజు, ఎ. రాంబాబు, ఎస్.శ్రీనివాసరావు, డి.నాగరాజు దారం నాగరాజు, రామోజీ, లైన్మెన్‌లు దాస్, జొన్నలగడ్డ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం



చల్లపల్లి: ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా విడనాడి పర్యావరణాన్ని కాపాడటంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకూ అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం-పర్యావరణాన్ని కాపాడుదాం, చెట్ల నాటుదాం-భూమిని కాపాడుదాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోట విజయరాధిక, మండల పరిషత్ సూపరింటెండెంట్ అతావుల్లా, పంచాయతీ కార్యదర్శి పేర్ని మాధవేంద్రరావు, ఎఎంసి ఛైర్మన్ తోట కనకదుర్గ, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ బోలెం నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని బుట్టాయిపేటలో వేంచేసి ఉన్న గణపతి సచ్చిదానంద దత్తాశ్రమంలో ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ రెండవ తేదీ వరకు శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు దత్తాశ్రమం భక్త బృందం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. 22వ తేదీ సోమవారం నుంచి అమ్మవారు పలు అలంకారాల్లో భక్తులకు దర్శనం ఇస్తారన్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో పూజ, పారాయణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 28వ తేదీన విద్యార్థులకు శ్రీ కాల భైరవాష్టకము స్తోత్ర పోటీలు, 29వ తేదీన సరస్వతి హోమం, సామూహిక సరస్వతీ పూజ నిర్వహిస్తామన్నారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి



కొడాలి(ఘంటసాల):సోషల్ మీడియా, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని చల్లపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.ఈశ్వరరావు అన్నారు. ఘంటసాల మండలం కొడాలి జెడ్పీ హైస్కూల్లో పోక్సో చట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై విద్యార్థులకు అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఈశ్వరరావు మాట్లాడారు. ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డి, హైస్కూల్ హెచ్ఎం పి.లక్ష్మీశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



మచిలీపట్నంటౌన్: బెరాకా మినిస్ట్రీస్ సంస్థ విద్యార్థులు, పేదలకు ఆర్థిక సాయం అందిస్తుండడం ఎంతో అభినందనీయమని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బెరకా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, పేద రోగులు, పేదలకు శనివారం రూ. 11 లక్షల ఆర్థిక సాయంను మంత్రి కొల్లు రవీంద్ర చేతుల మీదుగా అందజేశారు. కిరణ్ పాల్ మాట్లాడుతూ ఈ ఏడాది మొత్తం 29 మందికి రూ.11 లక్షల మేర ఆర్థిక సాయం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీస్ ఉపాధ్యక్షుడు తిరుమాని వెంకటేశ్వరరావు, సభ్యులు కప్పిరి ఆశీర్వాదం, నాగెళ్లెట్టి డానియల్, లోగెళ్లెట్టి స్వామి, వలివేటి వంశీ తదితరులు పాల్గొన్నారు.

కోడూరులో సత్కా రం



కోడూరు:మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులను గ్రామంలో సత్కరించారు. సర్పంచ్ ఉప్పాల లక్ష్మీ, వైఎస్సార్ సీపీ నేత ఉప్పాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించారు. ఉద్యోగాలు పొందిన పది మందిని ఒకే వేదికపైకి తీసుకువచ్చి శాలువాలు, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. యువత లక్ష్యం వైపు గురి పెట్టి, దానిని సాధించేందుకు పడిన కృషిని ఎంఈఓ రామదాసు, ఎస్ఐ చాణిక్య అభినందించారు.

పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



మున్సిపల్ కార్యాలయంలో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తదితరులు

పెడన: పరిసరాల శుభ్రతపై ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. స్వచ్ఛంద్రా...స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మున్సిపల్ కార్యాలయంలో మొక్కను నాటారు. తొలుత ఆయన మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మొక్కను నాటి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఉద్యోగులకు ఈఎస్ఐ ఆసుపత్రి ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పలువురు మున్సిపల్ ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. నందమూరు గ్రామంలో శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఎంపీడీవో అరుణకుమారి మొక్కలను నాటారు.

మెరకనపల్లి(మోపిదేవి): మండలంలోని పలుగ్రామాల్లో స్వర్ణాంధ్ర కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఉదయం మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. మెరకనపల్లిలో గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి దనరాజ్యలక్ష్మీ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ యర్రంశెట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రధాన కూడల్లో మొక్కలు నాటారు.

గూడూరు:పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. స్వచ్ఛత హీ సేవ, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా గ్రామ సర్పంచ్ లింగం సులోచనారాణి ఆధ్వర్యంలో గూడూరులో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్షిత నీటి పథకం ఆవరణలో జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబుతో కలసి ఎంపీపీ కొబ్బరి, మామిడి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.వి.రామకృష్ణ, డీసీ ఛైర్మన్ పోతన స్వామి, కలపటం సర్పంచి బనాల శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి భాస్కరరావు, లింగం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడల్లో విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతలను అభినందిస్తున్న వీసీ కూనా రాంజీ

కోనేరుసెంటర్:జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కృష్ణా విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. బ్యాడ్మింటన్ (పురుషులు, మహిళలు), చెస్ (పురుషులు, మహిళలు), టేబుల్ టెన్నిస్ (పురుషులు, మహిళలు), వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఉపకులపతి ఆచార్య కె.రాంజీ, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. ఉష, రెక్టర్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు, క్రీడా బోర్డు కార్యదర్శి లావణ్యలత, ఫైనాన్స్ ఆఫీసర్ రత్నన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనుబంధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు. నోడల్ ఆఫీసర్ ఎల్. సుశీల పర్యవేక్షణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ రాంజీ విజేతలను అభినందిస్తూ విద్యార్థులు క్రీడల్లో మరింత రాణించాలని, సాహిత్య కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొని జాతీయ క్రీడా దినోత్సవం స్ఫూర్తిని నిలబెట్టాలని పిలుపునిచ్చారు.

భోగాది కుటుంబానికి యడ్లపాటి పరామర్శ



భోగాది చిత్ర పటం వద్ద నివాళులర్పించిన రఘునాథ్‌బాబు, స్వరూపరాణి తదితరులు

పర్రచివర(నాగాయలంక):మండలంలోని పర్రచివర గ్రామంలో గత మంగళవారం మరణించిన బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర సీనియర్ నేత, వరిష్ఠ ఆర్ఎస్ఎస్ కార్యకర్త భోగాది వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను టుబాకో బోర్డ్ మాజీ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు, బీజేపీ ఇతర నాయకులు శనివారం పరామర్శించారు. తొలుత భోగాది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటేశ్వరరావు కుమారులు నరేష్, ఉపేంద్ర బాబును పరామర్శించి పార్టీ తరపున తమ సానుభూతి ప్రకటించారు. పార్టీ రాష్ట్ర మహిళా మోర్చ మాజీ అధ్యక్షురాలు యడ్లపాటి స్వరూపరాణి, కేంద్ర సెన్సార్ బోర్డు మాజీ సభ్యురాలు భోగాది రమాదేవి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ సహాయకుల ధర్నా



ధర్నా చేస్తున్న బందరు డివిజన్ గ్రామ రెవెన్యూ సహాయకులు

మచిలీపట్నంఅర్బన్: గ్రామ రెవిన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో బందరు డివిజన్లోని వీఆర్ఎలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్లో శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఎలు) ప్రస్తుతం గౌరవ వేతనం కేవలం రూ.11 వేలు మాత్రమే అందుతుందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగినా గత ఆరేళ్లుగా ఎటువంటి జీతభత్యం పెరగకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కుటుంబాలు జీవనాధారం కోసం కష్టాల్లో ఉన్నాయని తెలిపారు. వీఆర్ఎలకు వెంటనే పే స్కేల్ అమలు చేయాలని, అర్హత కలిగిన వారిని వీఆర్ఓలు, అటెండర్లు, నైట్ వాచ్‌మెన్లు, రికార్డు అసిస్టెంట్లుగా ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షులు కె. మహేష్, సెక్రటరీ జి. గంగాధరరావు, ట్రెజరర్ ఎ. ప్రసన్న కె. వెంకటేశ్వరరావు, భిక్షం, గోపి, పి. వీరవెంకటేశ్వరరావు, కె. అనురాధా, ఎం. శ్రీను, ఎం. నాగేశ్వరావు, ముసలయ్య, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

తీరంలో స్వచ్ఛ సాగర్



హంసలదీవి సాగరతీరంలో వ్యర్థాలను సేకరిస్తున్న మెరైన్ పోలీసులు



తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరుతున్న ప్రజలు

కృత్తివెన్ను: తీరప్రాంత పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని చిన గొల్లపాలెం, ఒర్లగొందితిప్ప బీచ్‌లలో క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తీరప్రాంత గ్రామాల్లోని యువత, స్థానిక పెద్దలు అంతా కలసి ఉదయం నుంచి తీరం వెంబడి పేరుకుపోయిన చెత్తాచెదారంతో పాటు, ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేసి ట్రాక్టర్‌లలో దూరంగా తరలించి దహనం చేశారు.

కోడూరు:అంతర్జాతీయ కోస్టల్ క్లీన్ (పరిశుభ్రత) దినోత్సవాన్ని పురస్కరించుకొని పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు హంసలదీవి సాగరతీరం పరిసరాలను శుభ్రపర్చారు. మెరైన్ సీఐ సురేష్ రెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది తీరం వెంట ఉన్న చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు అలలతో పాటు కొట్టుకువచ్చిన కర్ర దుంగలను సేకరించి దహనం చేశారు. బీచ్ పరిసరాలను పర్యాటకులు శుభ్రంగా ఉంచాలని సీఐ కోరారు.

మహిళల ఆరోగ్యంతోనే మెరుగైన సమాజం

కృష్ణాజిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎ.వెంకట్రావు



కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎ.వెంకట్రావు

యండకుదురు(ఘంటసాల):మహిళల ఆరోగ్యంతోనే మెరుగైన సమాజ నిర్మాణం సాధ్యమని కృష్ణా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎ.వెంకట్రావు అన్నారు. ఘంటసాల మండలం యండకుదురు గ్రామ శివారు జీలగలగండి కాలనీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని సర్పంచ్ పట్టాభిరామారావు, ఎంపీటీసీ కుమార్ రాజా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వెంకట్రావు కార్యక్రమాన్ని పరిశీలించారు. పీహెచ్‌సీ డాక్టర్ నిఖిత ప్రసాద్, ఎంపీహెచ్ఈవో భాస్కర్, పీహెచ్ఎస్ విజయదుర్గా, సీహెచ్‌ఓలు దేవ కుమారి, ఎన్. దివ్య, సమాధానం, ఎఎన్ఎంలు చిత్రకళ, జ్యోతి, శ్రీవాణి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పచారీ దుకాణంలో చోరీ

కోడూరు:పచారీ దుకాణంలో గుర్తు తెలియని దుండగులు దొంగతానానికి పాల్పడిన ఘటన కోడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ చాణిక్య శనివారం తెలిపిన వివరాల మేరకు.. కోడూరులోని గొల్లపాలెం రోడ్డులో ఉన్న సాయిలక్ష్మీ జనరల్ స్టోర్స్‌ను షాపు యజమాని చామర్తి శ్రీనివాసరావు రోజూ మాదిరిగానే శుక్రవారం రాత్రి కూడా తాళాలు వేసి వెళ్లాడు. అయితే అర్ధరాత్రి సమయంలో దొంగలు షాపు తాళాలపై డీజిల్ పోసి నిప్పు పెట్టి తాళాలను పగలు కొట్టారు. అనంతరం దుకాణంలో ఉన్న రూ.9వేల నగదును అపహరించినట్లు ఎస్ఐ చెప్పారు. యజమాని శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.